నాలుగేళ్లుగా నాన్చుతూ..!

రైతు రుణ మాఫీ చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర జాప్యం

- కొత్త రుణాల కోసం వెళితే.. పాత రుణాల సమస్య
- పాత రుణాలు రెన్యువల్ చేస్తేనే కొత్తవి ఇస్తామంటున్న బ్యాంకర్లు
- ఆర్థిక ఇబ్బందులతో పెట్టుబడుల కోసం ప్రైవేటు ఫైనాన్సర్లను ఆశ్రయించాల్సిన అన్నదాతలు
- వెంటనే రుణమాఫీ చేయాలని కోరుతూ విన్నపాలు




ఎదులాబాద్‌లో నాటుకు సిద్ధంగా.. వరినారు

ఘట్‌కేసర్: నాలుగేళ్లుగా రైతు రుణాలను మాఫీ చేయకపోవడంతో కర్షకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం పంట రుణమాఫీ హామీ ఇచ్చింది. ఈ మేరకు రైతులు ఫైనాన్సర్ల వద్ద రుణం తీసుకోద్దని సీఎం కేసీఆర్ పంట రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. దీంతో నాలుగేళ్లుగా రుణమాఫీ కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. బ్యాంకుల్లో రైతులు తీసుకున్న పంట రుణానికి వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకుంటే కొత్త రుణాలుగా పరిగణిస్తామని బ్యాంకులు అవకాశం కల్పించడంతో నాలుగేళ్లుగా వడ్డీ చెల్లిస్తున్నారు. 2018 డిసెంబర్ 11వ తేదీ లోపు తీసుకున్న పంట రుణాల్లో గరిష్టంగా రూ.లక్ష వరకు మాఫీ చేస్తామని బడ్జెట్‌లో రూ.6వేల కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కాగా ఇప్పటి వరకు రైతు రుణాలుమాఫీ చేయకపోవడంతో మేడ్చల్ నియోజకవర్గంలోని అన్నదాతలు పెట్టుబడుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఘట్‌కేసర్‌లో 1100 మంది...

ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలో 1100 మంది రైతులు రుణం తీసుకున్నారు. కాగా నేటి వరకు రూ.25 వేల లోపు రుణం తీసుకున్న 250 మందిలో 200 మందికి, రూ.50 వేల లోపు రుణం తీసుకున్న 350 రైతుల్లో 250 మందికి మాత్రమే రుణమాఫీ అయ్యింది. రూ.50 వేలపై పంట రుణం తీసుకున్న వారు సుమారు 500 మందికి పైగా ఉండగా జిల్లాలో వేలాది మంది రైతులు ఉన్నారు.



రుణమాఫీ పేరుతో రైతుల ఓట్లకు గాలం..

రైతు ప్రభుత్వం అంటూనే తమనే మోసం చేస్తున్నారంటూ అన్నదాతలు అంటున్నారు. రెండోసారి గద్దెనెక్కితే రూ.1లక్ష లోపు పంట రుణమాఫీ చేస్తామని బీఆర్ఎస్ సర్కారు ఎన్నికల మేనిఫేస్టోలో పొందుపరిచారు. కానీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటిన కొందరికే రుణమాఫీ తప్ప అందరికీ అమలు చేయడానికి నోచుకోలేదు. తీసుకున్న పంట రుణానికి నాలుగేళ్లుగా బ్యాంకర్లకు వడ్డీ చెల్లిస్తున్నా అసలు రుణం గుట్టలా అలాగే ఉండి పోయింది.

రెండు విడతలు అసంపూర్తే...

2019లో ఎన్నికల మేనిఫెస్టోలో రుణమాఫీ చేస్తానమని రూ.6వేల కోట్లు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. రైతు ప్రభుత్వమని చెప్పుకునే సర్కారు రుణమాఫీ చేస్తామని ప్రకటించి రెండో సారి అధికారంలోకి వచ్చాక రైతులనే మరిచిపోయింది. ఇప్పటి వరకు రుణమాఫీ వడ్డీలే భారమయ్యాయని, మిగిలిన రైతుల పంట రుణం ఒకే దఫాలో మాఫీ చేయాలని వేడుకుంటున్నారు. ఈ విషయమై ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం ఎండీ వివరణ కోరగా రెండు దఫాలు పంట రుణం మాఫీ చేశామని, రూ.లక్ష లోపు రుణమాఫీపై ప్రభుత్వం ఆదేశాల మీద ఆధారపడి ఉందన్నారు.

అన్నదాతలపై ప్రేముంటే మాఫీ చేయండి



హామీలిచ్చి ఓట్లు దండుకోగానే రైతులను సర్కారు మరిచిపోయింది. రైతులు కన్నెర్రె చేస్తే బీఆర్ఎస్ సర్కారు మంట కలిసిపోయితుంది. రైతులపై నిజమైన ప్రేముంటే ఒకే దఫాలో రుణమాఫీ చేయండి. రూ.60 వేలకు నాలుగేళ్లుగా వడ్డీ చెల్లిస్తున్నాను.

– మశ్చేందర్ రెడ్డి, రైతు, అవుషాపూర్

నాలుగేళ్లుగా వడ్డీ చెల్లిస్తునే ఉన్నా..



రుణమాఫీపై గతంలో ఇచ్చిన హామీని సర్కారు మరిచిపోయింది. అన్నదాతలపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తోంది. అన్నదాతలను ఆదుకోవడంలో ప్రభుత్వం మాట తప్పింది. రూ.80 వేల రుణం తీసుకున్నాను. అప్పు అలాగే ఉంది. నాలుగేళ్లుగా వడ్డీ చెల్లిస్తునే ఉన్నాను.

– బొబ్బలి శ్రీనివాస్‌రెడ్డి, అన్నదాత, అంకుషాపూర్

'రైతులను ఓటు బ్యాంకుగా చూస్తున్నారు'



రైతులకు ఏదో మేలు చేస్తున్నట్లు సర్కారు మొసలి కన్నీ రు కారుస్తోంది. నిజానికి రైతులను కేవలం ఓటు బ్యాంక్‌గానే రాష్ట్ర ప్రభుత్వం చూస్తోంది. ఎన్నికల ముందు వచ్చి హామీలు ఇవ్వడం ఎన్నికలు కాగానే మరిచిపోవడం రాజకీయ నాయకులకు పరిపాటిగా మారింది.

– బొక్క సత్తిరెడ్డి, రైతు, బొక్కనిగూడ

మంత్రిని కలిసిన అసమ్మతి కౌన్సిలర్లు



మంత్రి మల్లారెడ్డితో మేడ్చల్ మున్సిపాలిటీకి చెందిన పలువురు అసమ్మతి కౌన్సిలర్లు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీలో అసమ్మతి బావుట ఎగురవేసిన 16 మంది అసమ్మతి కౌన్సిలర్లు శుక్రవారం మంత్రి మల్లారెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. కౌన్సిలర్లు మూకుమ్మడిగా వెళ్లి మంత్రిని కలిసి చైర్‌పర్సన్ వ్యవహారంపై చర్చించారు. చైర్‌పర్సన్‌తో రాజీనామా ఎప్పుడు చేయిస్తారని, చైర్‌పర్సన్ వ్యవహార తీరుపై మరోసారి చర్చలు చేసినట్లు సమాచారం. కాగా సమస్యను త్వరగా పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు కౌన్సిలర్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు, మహిళా కౌన్సిలర్ల భర్తలు శ్రవణ్, మహేష్, సాటే నరేందర్, మణికంఠ, దేవ, గణేష్, నర్సింహ స్వామి, సందీప్‌గౌడ్, సాయికుమార్, మధుకర్‌యాదవ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు చెక్

మేడ్చల్: గుండ్లపోచంపల్లి పరిధిలోని 7వ వార్డులో బాసిరేగడిలో కౌన్సిలర్ రాజకుమారి సుధాకర్ మంచినీటి సమస్యను తీర్చారు. మున్సిపల్ నిధులతో బోర్ వేయించి మోటారు బిగించి విద్యుత్ కనెక్షన్ ఇచ్చి తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. చైర్ పర్సన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి తమ వార్డులో సమస్య ఉందని చెప్పగానే నిధులు కేటాయించారని, వార్డు ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని కౌన్సిలర్ తెలిపారు.



బోరును వేయిస్తున్న కౌన్సిలర్ రాజకుమారి

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మున్నూరు కాపులు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్‌ను ఆ సంఘం నాయకులు మేడ్చల్ పట్టణంలోని శివరామ కృష్ణ జ్ఞాన మందిరంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల సంఘం అధ్యక్షుడు ఈశ్వరయ్య, ముప్పిరెడ్డిపల్లి సర్పంచ్ పెంటయ్య, రాష్ట్ర కోశాధికారి విష్ణుజగత్, మురళీధర్, రఘురాం, నాగరాజు, రాంగోపాల్, కన్నా సురేష్,వేణు, రవిందర్, ప్రభాకర్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్ఆర్‌లో పడకేసిన పారిశుద్ధ్యం



కేఎల్ఆర్ విజయానగర్ నగర్ రోడ్ల పక్కనే ఇలా...

మేడ్చల్: మేడ్చల్‌లో అత్యంత ఖరీదైన ప్రాంతం కేఎల్ఆర్ విజయానగర్ ఫేజ్–2లో పారిశుద్ధ్యం పడకేసింది. మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పట్టించుకోకపోవడంతో రోడ్లపై చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పరిసర ప్రాంతాల ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్తను రోడ్లపైనే వేస్తుండటంతో రోడ్లు డంపింగ్ యార్డుల దర్శనమిస్తున్నాయి. శివాజీ విగ్రహం ఉన్న రోడ్డులో కింది భాగంలో పూర్తిగా రోడ్ల పక్కనే చెత్త వేస్తున్నారు. స్విమ్మింగ్ పూల్ సమీపంలో మ్యాన్‌హోళ్లు లీకవుతుండటంతో రోడ్లపైనే మురుగు ప్రవహిస్తూ ఇబ్బందులు కలిగిస్తున్నాయి. మరో వైపు పందుల సంచారం ఎక్కువ కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు పట్టించుకుని తమ సమస్యలను తీర్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.



సంచరిస్తున్న పందులు

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

మేడ్చల్: శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన విద్యార్థులు నాలెడ్జ్ అప్టిట్యూట్ టెస్టు కేఏటీ లెవల్–3 పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభకనబర్చారు. రెండో లెవల్‌లో 211 మంది అర్హత సాధించగా 14 మంది నగదు బహుమతి, 94 మంది బంగారు పతకాలు, 103 మంది మెరిట్ సర్టిఫికేట్లు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని స్కూల్ యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

క్రైం కార్నర్..

కుటుంబ సభ్యులు మందలించారని.. యువకుడి ఆత్మహత్య

శామీర్‌పేట్: కుటుంబ సభ్యులు మందలించారని యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి మండలం ఆద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన సందీప్(17) ఖాళీగా ఉండటంతో ఏదైనా పనిచేసుకోవాలని ఇంట్లో వారు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన సందీప్ పొలం వద్దకు వెళ్లి ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ.. డ్రైవర్ మృతి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన ఓ లారీ డ్రైవర్ చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. సీఐ అశోక్‌రెడ్డి వివరాల ప్రకారం... కరీంనగర్‌కు చెందిన పిల్లి కనకయ్య(55) కొంత కాలంగా ఘట్‌కేసర్‌లో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా ఈ నెల 17న రాత్రి బైపాస్ రోడ్డులో లారీని నిలిపి వందన హోటల్‌లో టీ తాగేందుకు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన బైక్ (ఏపీ16సీఎస్4393) ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయాలైన కనకయ్యను చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

అంగన్‌వాడీల్లో ప్రథమ చికిత్స బాక్సు!

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 793 అంగన్‌వాడీ కేంద్రాల్లో 95,017 మంది లబ్ధిదారులు

- 10 రకాల మందులతో ప్రథమ చికిత్స బాక్సు(పెట్టె)
- ఏ జబ్బుకు ఎలాంటి మందులు వాడాలో తెలిపేందుకు చిన్న బుక్‌లెట్ సైతం
- అంగన్వాడీల బలోపేతంతో తల్లిదండ్రుల్లో భరోసా



సాక్షి,మేడ్చల్ జిల్లా: చిన్నారులు సహజంగానే ఆరోగ్య పరంగా సున్నితంగా ఉంటారు. ఏ చిన్న గాయమైనా విలవిల్లాడుతారు. ఒకటి, రెండు రోజులు వేధించే జలుబు, ఆటలాడుకుంటుంటే.. తగిలే దెబ్బలకు చీటికి మాటికి వైద్యుడి దగ్గరకు తీసుకెళ్లడం ఆయాలకు, టీచర్లకు అనుకున్నంత సులభం కాదు. వీటిని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు పది రకాల మందులతో కూడిన ప్రథమ చికిత్స(ఫస్ట్ ఎయిడ్ బాక్సు) మందుల పెట్టెలు అందిస్తోంది. ఏ జబ్బుకు ఎలాంటి మందులు వాడాలో తెలిపే చిన్న బుక్‌లెట్‌ను కూడా బాక్సులతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు అందజేయటంతో పాటు ప్రాథమికంగా వారికి తర్ఫీదు కూడా ఇచ్చారు. అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా అందిచనున్న ఈ మందులతో అంగన్‌వాడీలపై తల్లిదండ్రులకు భరోసా ఏర్పడుతోంది. పలు సంక్షేమ కార్యక్రమాలు, ఆంగ్ల మాధ్యమం, పోషకాహారం పంపిణీతో పాటు అంగన్వాడీ సిబ్బందికి ఆకర్షనీయమైన వేతనాలు అందించడంతో పనితీరు మెరుగై ప్రజాదరణ పొందుతున్నాయి. తరచూ సందర్శనలు, అనుశీలనలతో ప్రతి కుటుంబాన్ని అంగన్వాడీ టీచర్ల సందర్శన తప్పనిసరి చేయడంతో మరింత చేరువైన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇక నుంచి ప్రథమ చికిత్స కూడా లభించనుంది. ఇందులో భాగంగా ప్రతీ అంగన్వాడీ కేంద్రంలో పది రకాల మందులు అందుబాటులో ఉండనున్నాయి. పిల్లల పొడవు లెక్క తీయటానికి కొలమానిని, బరువు తూకం వేయటానికి ఆధునిక పరికరాన్ని అందించారు. మందుల పేర్లు వాటిని ఎప్పుడు ఏ మోతాదులలో వినియోగించాలో వివరించే చిన్న(పుస్తకం) బుక్‌లెట్‌ను అందులో పొందుపరిచారు.

పది రకాల మందులివే...

పారాసెటమాల్ 500 మి.గ్రా., మెబెండోజోల్ 100 మి.గ్రా., బెంబైల్ బోంజోయట్ లోషన్, క్లోరోఫిల్ నైల్ ఐ ఆయింట్‌మెంట్, సిప్రోఫ్లోక్సేసైస్ ఐఅండ్ ఇయర్ డ్రాప్స్, ప్రోవైడిన్ ఐయోడిన్ ఆయిట్మెంట్, జెన్షన్‌వైలెట్, జింక్ మాత్రలు, అబ్జారెంట్ దూది, కాటన్ బ్యాండేజ్ వంటి మందులు పొందుపర్చారు.

గ్రేటర్‌తో సహా శివారు జిల్లాల్లో 3,307 కేంద్రాలు...

గ్రేటర్‌తో సహా శివారు జిల్లాల పరిధిలో మొత్తం 3,307 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. 3,43,614 మంది (చిన్నారులు, గర్భిణులు) లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో హైదరాబాద్ జిల్లాలో 914 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,19,800 మంది లబ్ధిదారులు, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాల్లో 95,017 మంది, రంగారెడ్డి జిల్లాలో 1600 అంగన్వాడీ కేంద్రాల్లో 1,28,797 మంది లబ్ధిదారులున్నారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కీసర: మరమ్మతుల కారణంగా నాగారంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ కామేశ్వరరావు తెలిపారు. ఇందులో భాగంగా వెస్ట్ గాంధీనగర్, ఈస్ట్ గాంధీనగర్, ప్రశాంత్‌నగర్, రాజ్‌సుఖ్‌నగర్, నేతాజీనగర్, బండ్లగూడ, శ్రీరాంనగర్, సాయిధరణినగర్, సత్యనారాయణనగర్, గోపీకృష్ణకాలనీ, అరవింద్‌నగర్, సాయిసంజీవ్‌నగర్, నాగారం కాలనీలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోదగారులు సహకరించాలని ఆయన కోరారు.

నూతన కార్యవర్గం

మేడ్చల్: జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గంను మేడ్చల్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఉదయ్‌కుమార్, కోశాధికారిగా వంశీకిరణ్‌లు ఎన్నికయ్యారు.

కాటమయ్య ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

పోచారం: అన్నోజిగూడలో నిర్మిస్తున్న కాటమయ్య ఆలయ నిర్మాణానికి పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి రూ.లక్ష విరాళంగా అందజేశారు. దాతల సహకారంతో గుడి నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా...

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ మాధురి

కీసర: మండల కేంద్రమైన కీసరలోని వివిధ వార్డుల్లో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని కీసర సర్పంచ్ నాయకపు మాధురి అన్నారు. శుక్రవారం కీసరలోని స్నేహకాలనీలో పారిశుద్ధ్య కార్మికుల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ఆమె స్థానిక వార్డు సభ్యుడు బలిజోనిబావి కృష్ణారెడ్డితో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సురేష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడి సేవలో మాజీ మేయర్



స్వామి సేవలో నగర మాజీ మేయర్ బండ కార్తిక రెడ్డి, ఆమె కుటుంబం

కీసర: కీసర గుట్ట శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి శుక్రవారం జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బండ కార్తిక రెడ్డి కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామి వారి సేవలో పాల్గొన్నారు. ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికగా ఆమె స్వామివారికి ప్రత్యేక అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

పక్కా భవనాలు నిర్మిస్తాం



శిథిల భవనాలు పరిశీలిస్తున్న సురేందర్

మేడ్చల్: గౌడవెల్లి గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రంకు, పశువైద్య శాలకు పక్కా భవనాలు నిర్మిస్తామని గ్రామ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ అన్నారు. రెండు శాఖల భవనాలు శిథిలావస్థకు చేరడంతో వాటిని నేలమట్టం చేయించారు. తాత్కాలికంగా రెండు కార్యాలయాలను అద్దె భవనాల్లోకి మార్చామని, త్వరలోనే భూమి పూజ చేసి రెండు నూతన పక్కా భవనాలు నిర్మిస్తామని ఆయన తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై అధికారుల కొరడా



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

జవహర్‌నగర్: అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. శుక్రవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నంబర్.818తో పాటు పలు ప్రాంతాల్లో నూతనంగా వెలసిన అక్రమ నిర్మాణాలను పోలీసు బందోబస్తు నడుమ తొలగింపజేశారు. ఈ సందర్భంగా కాప్రా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని హెచ్చరికలు జారీ చేసినా కొందరు కబ్జాదారులు పట్టించుకోవడంలేదని, మరోమారు నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ముమ్మరంగా కొనసాగుతున్న కంటి వెలుగు



వైద్యాధికారి సరితారెడ్డితో కలిసి నాగారంలో శిబిరాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి



ఘట్‌కేసర్‌లో పరీక్షలు పర్యవేక్షిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి

మేడ్చల్: ఉమ్మడి మేడ్చల్ మండలంలోని నాలుగు కేంద్రాల్లో కంటి వెలుగు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా మేడ్చల్ మున్సిపాలిటీలోని ముకుంద్ ఫంక్షన్ హాల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని సుతారిగూడలో, రాజబోల్లారం, శ్రీరంగవరం గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి కంటి పరీక్షలు చేసి అవసరమున్న వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. రెండో రోజు మేడ్చల్‌లో 230 మంది రిజిస్టర్ చేసుకోగా 190 మందికి పరీక్షలు చేసి 55 మందికి అద్దాలు పంపిణీ చేశారు. సుతారిగూడలో 106 మంది రిజిస్టర్ చేసుకోగా 20 మందికి అద్దాలు పంపిణీ చేశారు. రాజబోల్లారంలో 81 మందికి గాను ఆరుగురికి, బండమాదారంలో 105 మందికి గాను 33 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు.

నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో...

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలతో పాటు కీసర మండలంలోని కీసర, అంకిరెడ్డిపల్లి గ్రామాల్లో రెండో విడత కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతుంది. శుక్రవారం నాగారం పరిధిలోని 17వ వార్డు సత్యనారాయణ కాలనీలో కొనసాగుతున్న శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైద్యాధికారి డాక్టర్ సరితారెడ్డిలు పరిశీలించారు. కీసరలో సర్పంచ్ మాధురి, అంకిరెడ్డిపల్లిలో సర్పంచ్ మోర విమలతో పాటు వైద్యాధికారి డాక్టర్ సరితారెడ్డి కంటి వెలుగు వైద్యశిబిరాలను సందర్శించారు.

ఎన్ఎఫ్‌సీనగర్ కమ్యూనిటీ హాల్‌లో...

ఘట్‌కేసర్: కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్ అన్నారు. మున్సిపాలిటీ ఒకటో వార్డు ఎన్ఎఫ్‌సీనగర్ కమ్యూనిటీ హాలులో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని వైస్ చైర్మన్ మాధవరెడ్డితో కలిసి శుక్రవారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి, వైద్యులు ఫణీందర్‌రెడ్డి, విమల, శిరీశ, ఆశ వర్కర్స్ రాజేశ్వరీ, విజయ, డీఈఓ సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ రశీదులపై అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో నకిలీ రశీదులు, అక్రమ నిర్మాణాలపై అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యకు పంచాయతీ పాలకవర్గ సభ్యులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలోని నీమ్ నెస్ట్ సర్వే నంబర్లు 74, 75, 76, రేణుక సహస్ర ఇన్‌ఫ్రా సర్వే నంబర్లు 402 నుంచి 405, 409 నుంచి 412లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేసినా స్థానిక సర్పంచ్ సురేశ్, కార్యదర్శి పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. పైగా అక్రమ నిర్మాణాలకు నకిలీ రశీదులతో అనుమతిలిస్తూ సుమారు రూ.20 లక్షల వరకు గండి కొట్టారని ఆరోపించారు. జూన్ 2021 నుంచి నేటి వరకు గ్రామసభ నిర్వహించలేదని, అడిగితే యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మహిళా పొదుపు సంఘాల సమావేశాలు, ఎన్ఆర్‌జీఎస్ సమావేశాల ఫొటోలు పంపారన్నారు. సర్పంచ్, కార్యదర్శి, బిల్ కలెక్టర్‌పై పది రోజుల క్రితం డీపీఓకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు.



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎదులాబాద్ పాలకవర్గం

ఆదర్శ కార్పొరేషన్‌గా జవహర్‌నగర్‌ను తీర్చిదిద్దుతా..



పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ సాయిగణేష్‌నగర్ కాలనీలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించే అంతర్గత డ్రైనేజీ పనులను శుక్రవారం డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జవహర్‌నగర్ కార్పొరేషన్‌ను మరింత అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. మంత్రి మల్లారెడ్డి సహకారంతో జవహర్‌నగర్ ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహేష్, శ్రీమన్, శ్రీనాథ్, సాధిక్, భూమపాల్, వసంత, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తా..

జవహర్‌నగర్: డివిజన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించి అన్ని రంగాల్లో మందుంచుతానని జవహర్ నగర్ కార్పొరేటర్ జమాల్‌పూర్ నవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం 25వ డివిజన్‌లోని పాతబస్తీలో రూ.5లక్షల వ్యయంతో చేపట్టే అంతర్గత డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. డివిజన్ అధ్యక్షుడు శేఖర్, నాయకులు కందుల కృష్ణ, పల్లె క్రిష్ణగౌడ్, ఐలన్న, శాగ నర్సింహ పాల్గొన్నారు.



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న నవీన్‌కుమార్

మృతిచెందిన కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



షరీఫ్ కుటుంబానికి రూ.25 లక్షల చెక్కును అందజేస్తున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర

శామీర్‌పేట్: శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ కానిస్టేబుల్ షరీఫ్ డిసెంబర్ 9న రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో శామీర్‌పేట సీఐ సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో పేట్‌బషీరాబాద్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది, స్థానిక దాతలు సహకారంతో రూ.25 లక్షలు సేకరించగా శుక్రవారం ఆ మొత్తంను బాలానగర్ డీసీపీ కార్యాలయంలో సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర చేతుల మీదుగా షరీఫ్ కుటుంబానికి చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో డీసీపీ సందీప్, ఏసీపీ రామలింగరాజు, శామీర్‌పేట సీఐ సుధీర్ కుమార్, ఎస్సైలు వీరశేఖర్, రవికుమార్, మునీందర్, చంద్రశేఖర్, అనిత, సిబ్బంది పాల్గొన్నారు.